

21న విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా కళాశాల, పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 21న గురజాడ రచించిన దేశమును ప్రేమించుమన్నా గీతంలోని దేశభక్తి సారాంశం ఆధారంగా ఆ రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 3, 4, 5 తరగతిల విద్యార్థులు సబ్ జూనియర్స్‌గా, 6, 7, 8, తరగతుల విద్యార్థులు జూనియర్స్‌గా 9,10 తరగతుల విద్యార్థులు సీనియర్స్‌గా, ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ సూపర్ సీనియర్స్‌గా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 21న గురజాడ జయంతి సభలో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

పూర్తి స్థాయిలో అందని రేషన్

- స్మార్ట్ కార్డులంటూ హడావుడి
- పంపిణీకి నోచుకోని కందిపప్పు
- కొంతమందికే ఇంటింటికీ రేషన్
- అస్తవ్యస్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రజా పంపిణీ వ్యవస్థ పేద, మధ్యతరగతి ప్రజలకు అక్కరకు రావడం లేదు. గతంలో పలు రకాల సరుకులు రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చేవారు. గత వైసిపి ప్రభుత్వం నుంచి బియ్యం మినహా మిగిలిన సరుకులు ఏవీ పంపిణీ చేయడం లేదు. అప్పుడప్పుడూ అరకొరగా కందిపప్పు అందించినప్పటికీ ఏడాది కాలంగా అది కూడా సక్రమంగా అందడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా పరిస్థితుల్లో మార్పులు వస్తాయని రేషన్ లబ్ధిదారులంతా ఆశించారు. కానీ గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కూటమి సర్కారు సైతం కొనసాగిస్తున్న నేపథ్యంలో లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. కాకినాడ జిల్లాలో 6,45,811 బియ్యం కార్డులు ఉండగా 1,060 రేషన్ షాపుల పరిధిలో సరుకులు పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా రైస్ కార్డు పేద మధ్యతరగతి వర్గాలకు ఒక గుర్తింపు కార్డు లాంటిది. రేషన్ సరుకులు తీసుకోవాలన్నా, ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందాలన్నా, ఇంకా ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోవాలన్నా రైస్ కార్డే కీలకం. గతంలో ఎండియు వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగేది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసి రేషన్ దుకాణాల్లోనే సరుకులు తీసుకోవాలని నిర్ణయించింది. ప్రతి నెలా 1 నుంచి 10వ తేదీ వరకు సరుకులు ఆయా దుకాణాల్లో పంపిణీ చేస్తున్నారు. 80 నుంచి 90 శాతం మంది లబ్ధిదారులకు మాత్రమే సరుకులు చేరుతున్నాయి. మిగిలిన రేషన్ పక్కదారి పడుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనుంచి నెలంతా సరుకులు ఇవ్వాలని ప్రభుత్వం త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఎప్పటినుంచి ఈ విధానం అమలవుతుందనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు.

రేషన్ సరుకుల్లో కోత

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, ఇతర సరుకులను పేదలకు అందివ్వాలి. కానీ ప్రభుత్వం కొంతకాలంగా బియ్యానికే పరిమితమైంది. అక్కడక్కడా అరకొరగా పంచదార పంపిణీ చేస్తున్నా నాణ్యత లేకపోవడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ఇక కందిపప్పు సంగతి ప్రభుత్వం మర్చిపోయింది. నెలలు తరబడి కందిపప్పు దుకాణాల ద్వారా ఇవ్వడం లేదు. బహిరంగ మార్కెట్లో రూ.180 నుంచి 200 కందిపప్పు ధర ఉంది. జిల్లాకు సుమారు 650 టన్నుల కందిపప్పు అవసరం ఉంటుంది. రేషన్ షాపులలో కిలో కందిపప్పు రూ.67కి లభిస్తుంది. కానీ ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో లబ్ధిదారులకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు.

స్మార్ట్ కార్డులతో ఆర్భాటం

గత ప్రభుత్వ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని కూటమి ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. మరోవైపు అనవసరపు ఖర్చులతో సొమ్ములు వథా చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్మార్ట్ కార్డుల పంపిణీ ద్వారా ప్రజాధనం వథా చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వం ఇచ్చిన రైస్ కార్డులు బాగానే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం గుర్తింపు కోసం స్మార్ట్ కార్డులను తీసుకొచ్చి పంపిణీ చేస్తోంది. జిల్లాలోని రైస్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను తీసుకువచ్చి పంపిణీ కార్యక్రమం కొనసాగిస్తున్నారు. దీనికోసం రూ.6 కోట్లకు పైగా నిధులు వెచ్చిస్తున్నట్లు సమాచారం. స్మార్ట్ కార్డులపై ఉన్న శ్రద్ధ పేద ప్రజలకు ఇచ్చే నిత్యావసర వస్తువులపై లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆర్భాటంగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ కార్డుల స్థానంలో రేషన్ సరుకులను పంపిణీ చేస్తే బాగుంటుందని అభిప్రాయం లబ్ధిదారుల నుంచి వినిపిస్తుంది. బహిరంగ మార్కెట్లో నిత్యవసర సరుకులు కొనలేని పరిస్థితుల్లో ఉన్నామని వాటిని రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు వృద్ధులు, నడవలేని వారికి ఇంటింటికి రేషన్ సరుకులను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ పలుచోట్ల వద్దులే స్వయంగా వెళ్లి సరుకులను తెచ్చుకుంటున్న దుస్థితి ఏర్పడింది. రేషన్ డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ పేదలకు అక్కరకు రాకుండా పోతోందనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇంకోవైపు రేషన్ సరుకులను భారీగా పక్కదారి పట్టిస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ రేషన్ బియ్యం మాఫియా చెలరేగిపోతున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థను పేద, మధ్యతరగతి ప్రజలకు సక్రమంగా ఉపయోగ పడేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పంపిణీకి సిద్ధంగా ఉన్న స్మార్ట్ కార్డులు

వాహన మిత్ర నమోదు గడువు పొడిగించాలి

ప్రజాశక్తి-కాకినాడ

ఆటో, క్యాబ్ వాహనదారులకు ప్రభుత్వ వాహన మిత్ర సాయం కోసం నమోదు చేసుకునే గడువు మరొక వారం రోజులు పెంచాలని సిఐటియు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో, క్యాబ్ వాహనదారులు సెప్టెంబర్ 17 నుండి 19వ తేదీ వరకు సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని తెలిపారని, సచివాలయాల్లో కొన్ని సందర్భాల్లో సర్వర్‌లు పనిచేయక పోవడం వల్ల జనం పెద్దసంఖ్యలో గుమికూడడం వల్ల నమోదు ప్రక్రియ ఆలస్యం అవుతోందన్నారు. వాహనాలు అమ్మకాల సందర్భంలోరికార్డు ట్రాన్స్‌ఫర్‌కు కూడా సర్వర్లు పనిచేయక ఆలస్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న చెవ్వూరి రవి

ఎంఇఒలుగా స్కూల్ అసిస్టెంట్ల నియామకం తగదు

ప్రజాశక్తి-కాకినాడ

ఎంఇఒ పోస్టుల్లో స్కూల్ అసిసెంట్లను నియమించడం తగదని ప్రధానోపాధ్యాయ సంఘం ఖండించింది. శుక్రవారం అర్బన్ ఎంఇఒ కార్యాలయంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు మేడిశెట్టి కూర్మారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో హెచ్ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెవ్వూరి రవి తదితరులు మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారుల ఖాళీలలో ఇన్చార్జిల నియమాకానికి సంబంధించి అధికారులు ద్వంద్వ విధానాలను అవలంబిస్తున్నారని, ఉప విద్యాశాఖ అధికారులను నియమించేటప్పుడు డివిజన్ సీనియారిటీ, మండల విద్యాశాఖ అధికారులను నియమించేటప్పుడు జిల్లా సీనియారిటీని పరిగణలోకి తీసుకోవడాన్ని తప్పు పట్టారు. కేవలం నోటిమాట ద్వారా ఉత్తర్వులను జారీ చేయడాన్ని తప్పు పట్టారు. స్కూల్ అసిస్టెంట్లను ఇన్చార్జిలుగా నియమించడం వల్ల పాఠశాలల్లో బోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు సివివి.సత్యనారాయణ, పి.పుల్లయ్య, సాయి మోహన్, మురళీ భాస్కర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక చేపట్టారు. ఉమ్మడి జిల్లా కాలేజీ గేమ్స్ జూడోకు 16 మంది ఎంపిక కాగా వారికి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్టు ఉమ్మడి జిల్లా కాలేజీ గేమ్స్ సెక్రటరీ వెంకటరెడ్డి తెలిపారు. ఈ పోటీలకు రెఫరీగా జూడో మాస్టర్ తాండ్రోతు వీర వెంకటరమణ వ్యవహరించారు. జూడో పోటీలకు ఎనిమిది మంది బాలురు, ఎనిమిది మంది బాలికలు ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేమగిరి శ్రీనివాసరావు, రిఫరీ సాయికృష్ణ, దేవికృష్ణ, లెక్చరర్స్ షేక్ మదీనా, సిహెచ్.రాము పాల్గొన్నారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థులు



వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

లావా ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్స్ వైద్యశిబిరం

ప్రజాశక్తి-కాకినాడ

లావా ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్స్ సర్వీసెస్ ఆధ్వర్యాన శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కొల్లిక్రాంతి కుమార్ పర్యవేక్షణలో విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. తగిన మందులు పంపిణీ చేశారు. మధురానగర్‌లోని దీన్ దయాళ్ గ్రామీణ కౌశల్య యోజన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో 100 మంది విద్యార్థినులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ప్రధాన నిర్వాహకులు ఆర్.సాయిబాబు, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని పలు గ్రామాలకు నూతన లైన్ల నిర్మాణం వల్ల శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పెద్దాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్, ఎఇ రామచంద్రరావు తెలిపారు. చేబ్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో చేబ్రోలు పరిశ్రమలు, చేబ్రోలు, తాటిపర్తి, చినజగ్గంపేటకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి- తాళ్లరేవు

జాతీయ రహదారి 216పై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్టు ఎఎస్‌పి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన సుబ్బారాయుడు సెంటర్, పెట్రోల్ బంకు, పోలేకుర్రు, జై భీమ్ పేట జంక్షన్‌లో ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రమాదాలకు మానవ తప్పిదాలే కారణమన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. నేషనల్ హైవే అధికారులతో కలిసి పలుచోట్ల వాహనాల రాకపోకలను పరిశీలించారు. ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు జాతీయ రహదారి రెండు వైపులా తుప్పలను తొలగించాలని, ప్రమాదాలు నివారించాలని ఎఎస్‌పిని కోరారు. ఈ కార్యక్రమంలో కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, ఎఆర్ ఎస్ఐ జి.త్రినాథరావు, హైవే ఇంజనీర్ దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎఎస్‌పి శ్రీనివాసరావు



పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న రాజశేఖర్, రాజబాబు

ఇంజరం వంతెన వద్ద చెత్తను తొలగించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

సాగునీరుకు ఆటంకంగా ఇంజరం వంతెన వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వి.రాజబాబు డిమాండ్ చేశారు. గతంలో ఇరిగేషన్, ఆర్ అండ్ బి అధికారులు రోజు విడిచి రోజు చెత్త తీస్తామని చెప్పి నెలలు తరబడి పేరుకు పోతున్నా చెత్త తీయకపోవడం వల్ల సాగు నీటి పారుదలను చెత్త అడ్డుకుంటోందన్నారు. ఇప్పటికే వేసిన తూములు ఆరు ఉన్నప్పటికీ రెండు తూముల నుంచి మాత్రమే సాగునీరు కిందకు వస్తోందని, మిగతా వాటిని బాగు చేయాలని చెప్పారు.


ఆయుర్వేద వైద్య ప్రాముఖ్యత వివరిస్తున్న డాక్టర్ దివ్య

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

ప్రజాశక్తి -కరప

గురజనాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.దివ్య గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్య పద్ధతి ప్రాముఖ్యతను అయుర్వేద శాస్త్రం మానవ ఆరోగ్య సంరక్షణలో చేసే పాత్రను వివరించారు. సరైన ఆహారం, జీవనశైలి మార్పులు, ఔషధ మొక్కల వినియోగం ద్వారా శారీరక, మానసిక స్థిరత్వం సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. గ్రామస్తులకు యోగా ప్రాక్టీస్ ప్రాధాన్యం, దినచర్యలో దానిని అనుసరించటం వల్ల కలిగే లాభాలు గురించి యోగా టీచర్ పి.లోవరాజు వివరించారు.

ఆర్చరీ పోటీలకు 24 మంది ఎంపిక

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక ఆర్ఆర్‌హెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్ 19 స్కూల్ గేమ్స్ ఆర్చరీ బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు వీటిని ప్రారంభించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లా నలమూలల నుంచీ 95 మంది ఆర్చర్స్ పాల్గొన్నారని, ఎంపికైన 24 ఆర్చర్స్ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తరపున పాల్గొంటారని ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ ఎంపికల్లో అండర్ 19 స్కూల్ గేమ్స్ సెక్రెటరీ వెంకట్ రెడ్డి, శివరామకృష్ణ, న్యాయనిర్ణయేతలుగా మూర్తి, ఇమ్మాన్యుయేలు, కె.చిన్నబ్బాయి వ్యవహరించారన్నారు.

ఏలేశ్వరం ఎంపిడిఒగా వర్మ

ప్రజాశక్తి ఏలేశ్వరం

ఏలేశ్వరం ఎంపిడిఒగా సిహెచ్.రవికుమార్ వర్మ నియమితులయ్యారు. ఆయన అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ఎఒగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై ఏలేశ్వరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, సిబ్బంది సహకారంతో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల శుక్రవారం మహిళలు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గండేపల్లి మల్లేపల్లిలో వైద్యాధికారి నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి గంగరాజు, డాక్టర్ సురేంద్ర, సిహెచ్ఓ శర్మ, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.


పిఠాపురం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో డిసిహెచ్ఎస్ డాక్టర్ స్వప్న పర్యవేక్షణలో సూపరిండెంట్ డాక్టర్ సుజాత, హాస్పిటల్ అభివద్ధి కమిటీ సభ్యులు శిబిరాన్ని ప్రారంభించారు.

పెద్దాపురం పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించారు. డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు టిబి రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. మర్లావ, తిరుపతి, కాండ్రకోటలో సర్పంచులు తోట రామకృష్ణ, మొయిళ్ల కృష్ణమూర్తి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, డాక్టర్ చంద్ర కిరణ్, డాక్టర్ ఉష, డాక్టర్ శ్రావణి, డాక్టర్ అనూష, డాక్టర్ దీపిక, సిడిపిఒ జి.ఉష పాల్గొన్నారు.


తాళ్లరేవులో వైద్య శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

తాళ్లరేవు పిహెచ్‌సి వైద్యాధికారి ఈశ్వర్ ఆధ్వర్యంలో సీతారామపురం, పాత కోరంగిలో శుక్రవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. అంగన్‌వాడీలు పార్వతి, మహేశ్వరి, కృష్ణవేణి, ఆదిలక్ష్మి, డాక్టర్ రవి కుమార్, కనక రత్నం, పార్వతి, ఆదిలక్ష్మి, మహేశ్వరి రాఘవమ్మ, కృష్ణవేణి, ఎంపిహెచ్ఒ బొడ్డు కుమార్, హెచ్‌వి లక్ష్మి, ఎంఎల్‌హెచ్ పి.సింధు, పాలిక హేమంత్, ఎఎన్ఎంలు రోజా, వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు కాల ఆంజనేయులు, కెఎన్.ప్రసాద్, ఒ.శ్రీను, సిహెచ్.బాలకృష్ణ, గౌరీశ్వరి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కొనసాగిన విఆర్‌ఎల ధర్నాలు

విఆర్‌ఎఒల సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా 2వ రోజు శుక్రవారం పలుచోట్ల తహశీల్దారు కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం విఆర్‌ఎల సంఘం నాయకులు దువ్వారు వీరబాబు, వాకలపూడి శ్రీనివాస్, సత్య కిరణ్, భరత్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. సమ్మె శిబిరం నుంచి ప్రదర్శనగా వెళ్లి ఆర్‌డిఒ శ్రీరమణికి వినతిపత్రం అందజేశారు. సుందరపల్లి రామలింగేశ్వర రావు, చింతపల్లి సాయి భువన్, నూకతట్టు వెంకటరమణ పాల్గొన్నారు.

తాళ్లరేవు యండమూరి శేషయ్య, మడికి రాంబాబు మాట్లాడారు. మోర్త పండు బాబు, సిద్ధన బాబూరావు, మురమళ్ల సునీతా దేవి, పండవలస సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.


పెద్దాపురంలో ఆర్‌డిఒకు వినతి ఇస్తున్న విఆర్‌ఎలు



పిఠాపురంలో నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు

పిఠాపురం సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు అప్పలస్వామి, రాజరత్నం మాట్లాడారు. దూలపల్లి సత్తియ్య, కె.తమ్మారావు, నీలం సూర్యనారాయణ, వేమగిరి తాతారావు, కొమ్ముకూరి శేషా రత్నం, గోపాన అబ్బులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం షేక్ దాదాసాహెబ్, కొత్తపల్లి సత్తిబాబు, పొట్లాడ రమేష్, జాజిమొగ్గల సత్యనారాయణ పాల్గొన్నారు.

గండేపల్లి విఆర్‌ఎల సంఘం అధ్యక్షులు సాదే శ్రీనివాస్ సెక్రటరీ అమీర్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు

అన్నదాత సుఖీభవ డబ్బులు జమ చేయాలి

ప్రజాశక్తి - కాజులూరు

అన్నదాత సుఖీభవ డబ్బులు కౌలు రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని కోరుతూ ఈ నెల 22న విజయవాడ నుంచి అమరావతి ర్యాలీ చేపట్టామని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు తెలిపారు. శుక్రవారం శీలలంక, కాజులూరు, దుగ్గుదుర్రు, కుయ్యేరు, కోలంక, పల్లెపాలెంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2011 కౌలు చట్టాన్ని రద్దుచేసి 2019 చట్టం తీసుకురావడం వల్ల కౌలు రైతులకు నష్టం జరిగిందన్నారు. భూ యజమాని అనుమతి తొలగించి ఆ చట్టాన్ని మార్చి గత 2011 చట్టాన్ని అమలు చేస్తామన్న ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.


సామర్లకోటలో దస్తావేజు లేఖర్ల నిరసన

దస్తావేజు లేఖర్ల నిరసన

ప్రజాశక్తి-యంత్రాంగం

పిఠాపురం ఒటిపి విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖర్లు పిఠాపరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాపారావు, సూర్యప్రకాశరావు, లోవ ప్రసాద్, సత్యనారాయణ, రామారావు పాల్గొన్నారు.

సామర్లకోట దస్తావేజు లేఖరుల సంఘం రాష్ట్ర ప్రతినిధి మల్యాల సీతాపతి రావు తదితరులు నిరసన తెలిపారు. గోగు అప్పారావు, అమీర్, పేకేటి చిన్నపుత్రయ్య, వెంకట్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు

ప్రజాశక్తి - పెరవలి

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. పెరవలి సెంటర్‌లో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. పెనుమంట్ర మండలం భట్లమగుటూరుకు చెందిన మహాశివబట్టు లక్ష్మీనారాయణరాజు మద్యం సేవించి బైకు నడుపుతున్నట్టు గుర్తించామన్నారు. కేసు నమోదు చేసి తణుకు కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితునికి న్యాయమూర్తి మూడు రోజులు జైలు విధించారనానరు.కాకరపర్రు గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.2,280 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా తలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-రౌతులపూడి

రౌతులపూడి-బంగారిపేట రహదారి మధ్యలో శుక్రవారం ఎస్ఐ వెంకటేశ్వరరావు వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఎస్.పైడిపాలకు చెందిన కుర్రి శివప్రసాద్ రెడ్డి 30 లీటర్ల సారాను తరలిస్తుండగా అదుపులోనికి తీసుకున్నారు. నిందితుని కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రౌతులపూడి

రౌతులపూడి చెందిన ఇటంశెట్టి వెంకట సత్యనారాయణ (40) కుటుంబ సమస్యలతో గురువారం పురుగు మందు తాగాడు. ఆయనను కాకినాడ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యూరియా కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తిలో యూరియా బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్న కేసులో నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సిఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ ఎం.రామకృష్ణ వివరాలు వెల్లడించారు. ఇప్పనపాడు గ్రామానికి చెందిన గుత్తుల దుర్గారావు, తాటిపర్తికి చెందిన దాసం శ్రీనివాస్, కొద్దెల కనక వీరబాబు, ద్వారపూడికి చెందిన కోటారి రాంబాబులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

కరప ఎంపిడిఒగా కృష్ణగోపాల్

ప్రజాశక్తి -కరప

కరప ఎంపిడిఒగా నియమితులైన ఎం.కృష్ణగోపాల్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి, సర్పంచు, ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ నరసింహారావు, సీనియర్ అసిస్టెంట్ కోలాటం సుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానందం, యు.నిర్మలాదేవి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఇఒ సుబ్బారావు

కార్తీకమాసం ఏర్పాట్లపై ఇఒ సమీక్ష

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం సత్యదేవుని సన్నిధిలో కార్తీకమాసంలో వచ్చే యాత్రికుల అవసరాలు అనుగుణంగా అందించే ఏర్పాట్ల గురించి అధికారులతో ఇఒ వీర్ల సుబ్బారావు సమీక్షించారు. శుక్రవారం కొండపైన కమాండ్ కంట్రోల్ హాల్లో ఇఒ సుబ్బారావు అధికారులతోను వైదిక కమిటీ సభ్యులతో కలిసి కార్తీక మాసం ఏర్పాట్లపై వారం అడిగి తెలుసుకున్నారు. కార్తీకమాసం వచ్చేనాటికే త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మరిడమ్మకు పూజలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్ శర్మ, ఎస్.ఐ.అవధాని, శంకర్, ఆలయ చైర్మన్ రాయి నాని, రాజేంద్రప్రసాద్, ఎస్.రమణ, జి.క్రాంతి, వరహాలు, శివ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ మండల పరిధి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కెవి.మరమ్మత్తు పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని శుక్రవారం ఏపిఇపిడిసిఎల్ ఎఇ ఎవిఎస్ఎస్.ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మండల పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

22 నుంచి శ్రీపీఠంలో మహాశక్తి యాగం

ప్రజాశక్తి -కాకినాడ రూరల్

ఈ నెల 22 నుండి అక్టోబర్ మూడో తేదీ వరకు కాకినాడ శ్రీపీఠంలో మహా శక్తియాగం నిర్వహిస్తున్నామని శ్రీపీఠం పరిపూర్ణానంద స్వామిజీ పేర్కొన్నారు. రమణయ్యపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాశక్తి యాగం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని తెలిపారు. పది సంవత్సరాల కాలంలో 1000 కోట్ల కుంకుమార్చన చేయడమే లక్ష్యంగా శ్రీపీఠంలో 3వ సంవత్సరం మహాశక్తి యాగం కుంకుమార్చన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మహా యాగంలో పాల్గొనడానికి 35 వేల మంది భక్తులు రిజిస్ట్రేషన్లు చేసుకొన్నారని తెలిపారు. 11 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో సుమారు 4 లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని, వారి కోసం సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. అన్నదానం నిమిత్తం సుమారు 70 కౌంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు.



నిరసన తెలియజేస్తున్న ఓచర్ పెయిడ్ ఉద్యోగులు

ఓచర్ పెయిడ్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - యానాం

కారైకల్‌లో ఓచర్ పెయిడ్ ఉద్యోగి జయరామన్‌ను సీనియర్ మెకానిక్ ముత్తు కృష్ణన్ కులం పేరుతో దూషించి దాడికి పాల్పడ్డాడని, అతడిని విధుల నుంచి తొలగించాలని ఓచర్ పెయిడ్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ నాగబాబు ఆధ్వర్యంలో పిడబ్ల్యుడి కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఇటువంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ఆర్థిక సాయం అందిస్తున్న రిటైర్డ్ హెచ్ఎం రామారావు

చిన్నారి చికిత్సకు రూ.లక్ష సాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణానికి చెందిన వెంకటరమణ, సూర్య కళ దంపతుల 3 నెలల కుమార్తె చికిత్స నిమిత్తం మన పెద్దాపురం ఫేస్‌బుక్ బృందం రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఫేస్బుక్ అడ్మిన్ పెద్దిరెడ్డి నరేష్ మాట్లాడుతూ మూడు నెలల నుంచి చిన్నారి పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతోందన్నారు. ఈ బాలిక వైద్య ఖర్చులు నిమిత్తం దాతలు ఈ ఆర్థిక సహాయం అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హెచ్ఎం ఎంద్ర రామారావు, గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఎంపిడిఒ

అవగాహనతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

ప్రజాశక్తి- పెద్దాపురం

ప్రజా ప్రతినిధుల సమన్వయంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ కె.వెంకట సూర్యనారాయణ అన్నారు. పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాలకు సంబంధించిన ఎంపిపిలు, సర్పంచులకు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన పెంచుకోవడం ద్వారా తమ పరిధిలోని గ్రామాలు, మండలాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. మూడు విడతలుగా నిర్వహించే ఈ శిక్షణ శిబిరం ఒక్కొక్క విడతలో రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామన్నారు. డిప్యూటీ ఎంపిడిఒ జివి.శేఖర్ రెడ్డి, మండల కార్యాలయ ఎఒ ఎస్.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ జి.బుల్లెమ్మ అన్నారు. మండలంలోని కట్టమూరు జెడ్‌పి హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన చట్టాలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా తమ కుటుంబ సభ్యులకు చట్టాలపై అవగాహన పెంచవచ్చన్నారు. ఈ సదస్సులో ఆమె వివిధ చట్టాలు, బాల్య వివాహాల వల్ల అనర్థాలను వివరించారు. ఈ సదస్సులో ఎస్ఐ వి.మౌనిక, డిఎఇఒ ఈరంకి శర్మ, హెచ్ఎం మీనా మాధురి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తటవర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంపిడిఒగా భానూజీ

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఎంపిడిఒగా హెచ్.భానూజీ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డిప్యూటీ ఎంపిడిఒ పదవి ఉద్యోగోన్నతి పై కపిలేశ్వరపురం మండల కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి ఆర్.మోహన్, కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన ఎంపిడిఒ భానూజీ మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారానికి, మండల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - మండపేట

తాపేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి.తాపేశ్వరం ఫీడర్, 11 కెవి.వెలగతోడు ఫీడర్‌లో పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాపేశ్వరం, ఇప్పనపాడు, వెలగతోడు, మెర్నిపాడు గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.


సబ్ జైల్ పరిశీలన

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని సబ్ జైలును జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్.శ్రీలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రిమాండ్ ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాలు, తాగునీరు గురించి అడిగి తెలుసుకున్నారు. రిమాండ్ లో ఉన్న వారికి న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సబ్ జైల్ అధికారి ఎల్.రంగస్వామి, కె.వెంకటేశ్వరరావు, ఐ.విపి.ఎస్.జానకి, సుభాషిణి, ఎం.జ్యోతి దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన యువకులకు సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట



యువతను అభినందిస్తున్న ఎంఇఒలు

కాపవరంలో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన గ్రామానికి చెందిన యువకులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఎంఇఒలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, గ్రామ నాయకులు, ఎస్ఎంసి సభ్యులు ఆధ్వర్యంలో ఈ సత్కారం నిర్వహించారు. గ్రామానికి చెందిన పురం అరుణ్ కుమార్ ఉపాధ్యాయునిగా, రాగం రాజ్ కుమార్ సివిల్ కానిస్టేబుల్‌గా, పోలవరపు అజయ్ ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా ఉద్యోగాలు పొందారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాధవరావు, హెచ్ఎం వెంకన్న బాబు, ఉపాధ్యాయులు ఆశాలత, దుర్గాదేవి, చిన్ని, ఎస్ఎంసి చైర్మన్ రత్నరాజు, గ్రామ నాయకులు అర్జున్, సుధాకర్, సూరిబాబు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - జగ్గంపేట

పరిసరాల పరిశుభ్రత లేకుంటే వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు తెలియజేసి అవగాహన పరచాలని జగ్గంపేట పంచాయితీ కార్యదర్శి జివివిఎస్‌కె.ప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రమైన జగ్గంపేటలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కోసం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఎస్‌విఎస్.అప్పలరాజు, కొత్త కొండబాబు, పాంద్రంకి రాంబాబు, దేవరపల్లి మూర్తి పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపై నిర్లక్ష్యం వహించరాదు

ప్రజాశక్తి-కాజులూరు

పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు నిర్లక్ష్యం వహించరాదని పశుసంవర్ధక శాఖ డిఎల్‌ఎడి కార్యనిర్వహణాధికారి కాంతారావు అన్నారు. మండలంలోని పెద్దలంకలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో గోసాల వద్ద ఉచిత గర్భ కోసవ్యాధుల ఉచితపశు వైద్య శిబిరం నిర్వహించారు. 100 పశువులకు ఉచిత గర్భ కోసం పరీక్షలు నిర్వహించి లేగ దోడలకు ఇతర పశువులకు మినరల్ మిక్సర్ అందించి మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఇఒ కాంతారావు మాట్లాడుతూ పెయ్య దూడల ఉత్పత్తి పథకం ద్వారా రూ.150కే సూది మందు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, ఎడిఎ బ్రహ్మ వేద, పశువైద్యాధికారులు చెక్కపల్లి శ్రీరామ్, సుధీర్ సామ్యూల్, రామకోటేశ్వరరావు, ప్రియాంక, సుధా, శుభశ్రీ పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి 'గుడ్‌సీడ్' రూ.30 వేల సాయం

ప్రజాశక్తి - అమలాపురం

పేద విద్యార్థిని చదువు కొనసాగించేందుకు అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచె రమణారావు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి ఊర పేటకు చెందిన ఆర్థిక స్తోమత లేని పేద విద్యార్థిని గంటి జానకి గోడి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ బైపిసి గ్రూపు చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది.జానకి బి ఎస్ సి ఫిషరీస్ కోర్సు చదివేందుకు ఆసక్తి కనపరిచింది. ఫిషరీస్ కోర్సు ప్రయివేటు కళాశాల్లో చదవాలంటే రూ.1.60 లక్షల ఫీజు చెల్లించాలి. విద్యార్థిని తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆర్థిక స్తోమత లేని విద్యార్థిని జానకికి తనకు ఇష్టమైన బిఎస్‌సి ఫిషరీస్ కోర్సును చదివించేందుకు రమణారావు ముందుకు వచ్చారు. నాలుగు సంవత్సరాలు బిఎస్‌సి ఫిషరీస్ కోర్సు చదివేందుకు జానకికి ఇప్పటికే రెండు సంవత్సరాల కోర్సు చదివేందుకు రమణారావు ఆర్థిక సాయం అందించారు. మూడో సంవత్సరం ఫీజుగా రూ.30 వేల సాయం చేశారు. విద్యార్థిని జానకికి రూ.30 వేల చెక్కును అంద జేశారు.